# ఏమీ లేదు, శూన్యం !

కందుల గోపాలరావు

★

"బాబుగారు! పెద్దమ్మాయిగారి పెళ్ళెప్పుడండి"

"ఉద్యోగం రావద్దురా ?"

"రాకమానదేంటి బాబయ్యా! బి.ఏ. పాసైన దొరలకి"

"ఉద్యోగం అయినతర్వాతనే పెళ్ళి చేద్దామనిరా, వెంకయ్య"

"ఉద్యోగం రాకపోతే యిక పెళ్ళి కానట్టేనండి పెద్దమ్మాయిగార్కి"

"ఓరి వెధవా! నే చెప్పేది నీ కర్థంగాలేదు. ఉద్యోగమవుతే వాడు, వాడి పెళ్ళాన్ని పోషించుకోగల్గుతాడురా. అందుచేతనే అంతవరకు పెళ్ళి చెయ్యదల్చుకోలేదు"

"క్షమించండి బాబూ, బారిష్టరుగారు!

అవుతే తెలియకడుగుతున్నాను బాబయ్యా! మరి యీ చదువులన్నీ కేవలం ఉద్యోగాలు గురించేనన్నమాట. ఒకవేళ ఉద్యోగాలు ఖాళీలు లేకపోతే, యీ ఇంగ్లీషు చదువుకున్న దొరలందరూ అచ్చోసిన...ల్లా తిరగడమేనాండి ? ఎందుకొచ్చిన చదువులండీ! ఉద్యోగాలు దొరక్కపోతే స్వతంత్ర జీవనం గడపసాగని యీ చదువూ, సంధ్యానూ. "నేను బి.ఏ—నేను యం. ఏ" అని మెడ లెగరేసుకొని చెప్పడంతోటే కడుపు నిండుతాదాండి ? ఈ బ్రతుకుతెరువు లేని కాగితపు పట్టాలతో (Degrees)"

"ఆ...ఆ..."

తల్లు పడుతున్న మంగలి వెంకయ్యకు బారిష్టరు సుందరలాల్‌గారు 'ఆ...ఆ..." అన్న అక్షరం తప్పించి యిక సమాధానం చెప్పలేని అప్పటి అవస్థ చూస్తే, అప్పుడే కాదు యింటికి వచ్చిన తర్వాతకూడా నా గదిలో కూర్చుని నాలో నేను నవ్వుకున్నా. ఎందుకో అప్రయత్నంగా "నువ్వు మాత్రం ఏమి సమాధానం చెప్తావు" అనే ప్రశ్న బయలుదేరింది నాలో. నాకా క్షణంలో నిజంగా కంగారుపుట్టి "సర్" "రావుబహద్దూరు" బిరుదులు గల మహావేత్తలదగ్గరికి పరుగెత్తి అడుగుదామనుకున్నా. కాని వాళ్ళుమాత్రం ఏమి చెప్పగలరు—ఆమాత్రం చెప్పగల్గితే దేశంలో యీ నిరుద్యోగసమస్య వుండకపోయేదేమో అనుకొని-అంతలోనే నేటి యీ అర్థరహిత విద్యావిధానమే వుండకపోయేదేమో అనిపించింది. పాపం! M S. M దేవాలయానికి (March, September, March) ప్రదక్షిణలుచేసే కాలేజీ విద్యార్థులు, మూడు సంవత్సరాలు తపస్సుచేసి ఫలితం కల్గకపోతే కాశీవిశ్వేశ్వరపత్రాలూ అందుకునే సోదరులను చూస్తే, అబ్బా ఏమి చెప్పమంటారు ? బారిష్టరుగారి రహదారికేనా వీరందరూ నడకసాగించవలసింది అని సందేహించేను. కడకి "నేటి విద్యావిధానం తప్పా—యీ విద్య నభ్యసించడం తప్పా ?" అనే ప్రశ్నమాత్రం మిగిలింది. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేక, కలలో ఆత్మారాముడు సమాధానం చెప్తాడనుకుంటే, కనీసం విద్యామంత్రినైనా ప్రత్యక్షం చేయలేదు. ఎవ్వరూ సమాధానం చెప్పకపోతే, యీ విద్యావిధానంలో "ఏమిలేదు—శూన్యం" లాగుంది. చెప్పడానికి అందుచేతనే ప్రత్యక్షంగా లేదు యిద్దరిలో ఒక్కరైనా అని అనుకుంటూ, తటాలున జ్ఞాపకం వచ్చి దేశం స్వాతంత్ర్యం పొందింది యింక కొనసాగుతవిలే యీ చిక్కుప్రశ్నలు అని సంతోషపడ్డా.

ఏమౌ భావిష్యమౌతుందో.

శ్రీ ఆనందవాణి